# నాన్నలూ – ఇది మీ కోసమే

అభిమన్య

'అమ్మా

చీకటిని నిశ్శబ్దాన్నీ ఆవరిస్తూ నా చెవివరకూ చేరింది ఆర్తనాదం! సూటిగా గుండెలకు తాకింది!

పూర్తి సుషుప్తి కాని – పూర్తి జాగ్రతావస్థ కాని స్థితిలో వున్నాన్నేను రోజూ రాత్రి పదకొండువరకూ నాకు అలవాటైన అవస్థ అది!

పేరుకు ఆరుబయలు అని చెప్పుకోవటానికి మా రెండుగదుల అద్దె యింటి ముందు వాకిలికీ గేటుకూ మధ్య పదడుగుల ఖాళీ స్థలం వుంది వేసవంతా ఆ ఖాళీ స్థలంలోనే నేను మంచం వేసుకుని పడుకుంటాను ఎప్పుడన్నా చుట్టపు చూపుగా యింత చల్లగాలి వంటికి తాకితే ఉబ్బి తబ్బిబ్బయిపోతుంటాను కూడా!

అమ్మా

మరోసారి ఆర్తనాదం! అదే ఆర్తనాదం! అవే గొంతుకలు! పసివాళ్ల వేదనా స్వరాలు!

హృదయాన్ని కలచివేస్తున్న సముద్ర ఘోష!

లేచి మంచంమీద కూచున్నాను

ఎదురుగా మెట్లమీద రెండు పసిడి బొమ్మలు నించుని వున్నై! ఆ బొమ్మల్ని అలాంటి స్థితిలో చూడటం మొదటిసారి!

గేటు పక్కనుంచి కాంపౌండును అంటుకునే పైకి పోవటానికి మెట్లున్నాయి! మెట్లెక్కి పైకిపోతే మూడు గదుల వాటా వుంటుంది! అందులో ఓ గొప్ప వ్యక్తి ఐదారేళ్ళుగా కాపురం చేస్తున్నాడు నాకంటే సీనియర్! నేనా యింట్లో చేరి రెండేళ్ళు మాత్రమే!

ఆ గొప్ప వ్యక్తి సంతానమే ఆ పసిడి బొమ్మలు! ఆయనగారి పేరు వరహాలరావు ప్రసిద్ధుడైన రచయితనీ – రంగస్థల నటుడనీ – మా శ్రీమతి చెబితే నాకు తెలిసింది

నిజం కూడా! కాబట్టి వరహాలరావు నా దృష్టిలో గొప్ప వ్యక్తిగానే నిల్చిపోయాడు

పసిడి బొమ్మలలోని బాబుకు పదేళ్ళుంటై –పాపకు ఎనిమిదేళ్ళు వుండొచ్చు!

ఇద్దరి కళ్ళంట నదులు ప్రవహిస్తున్నై! ఒక్కో మెట్టే దిగుతున్నారు నోరెత్తి మాట్లాడే ధైర్యం వున్నట్లు లేదు

వాళ్ల స్థితి విదారకంగా వుంది!

ఏం తోచక వాచి చూసాను

పదకొండుకు పదినిమిషాలే తక్కువ

ఈ రెండేళ్లలో పిల్లలు తండ్రికోసం అలా ఏడుస్తూ నిరీక్షించిన సందర్భం ఒక్కటైనా లేదు మరిప్పుడిలా? రెండుసార్లు – అమ్మా అమ్మా అని స్వరపేటికల్ని పగలకొట్టుకుని – మెట్లు దిగొచ్చిన పసివాళ్ల ముఖాల్లో ద్యోతకమవుతున్న దైన్యం నన్ను మౌనంగా వుంచలేక పోయింది

కూచున్న చోటునుంచే అడిగాను –

ఏం బాబూ – నాన్నగారి కోసమా?

'ఔను అన్నట్లు ఇద్దరూ తలలాడించారు

'వచ్చే టైం అయిందిలే – మీరు పైకి వెళ్లండి అన్నాను అనునయంగా

వాళ్ళు కదల్లేదు

ఇక లేచి వాళ్ల దగ్గరికి వెళ్లక తప్పలేదు నాకు!

చటుక్కున నన్ను వాటేసుకున్నాడు బాబు!



## నాన్నలూ - ఇది మీకోసమే

పాప నిర్భయంగా గొంతెత్తి ఏడవసాగింది

ఏమైంది పాపా - ఎందుకేడుస్తున్నావ్? పాప కళ్లు తుడుస్తూ అన్నాను

అమ్మ - అమ్మ అంకుల్ అన్నారిద్దరూ ఒకేసారి, చెరో వైపు నన్ను అంటుకుపోతూ

అమ్మకేమైంది? అని అడగటం అనుచితంగా తోచింది నాకు వెంటనే ఇద్దర్నీ తీసుకుని పైకి వెళ్లటం నాకది మొదటిసారి కాకపోయినా - వాళ్ళు యింట్లో వుండగా ఎప్పుడూ వెళ్లలేదు నేను వరహాలరావు గొప్ప వ్యక్తేగాక చాలా రిజర్వ్‌డ్ మనిషి! ఆయనలాగే ఆయన శ్రీమతీ - పిల్లలూ!

వరహాలరావు ఆ యింట్లో వుంటున్నాడని మా ఇంటి యజమానికి మాకు తప్ప - పక్కింట్లో కూడా తెలీదని మంటాపదంగా చెప్పగలను అదవా తెల్సినా పట్టి పేరు మాత్రమే - రచయితనీ - నటుడనీ కాదు!

సరాసరి బెడ్‌రూంలోకి నన్ను తీసుకు వెళ్లారు ఎల్లలు

బెడ్‌మీద కళ్ళు మూసుకుని పడుకుని వుంది - ఆమె! పైన ప్యాన్ ఫుల్ స్పీడ్‌లో తిరుగుతోంది! ట్యూబ్ లైట్ వెలుగులో ఆమె ముఖాన్ని కప్పేసిన స్వేద బిందువులు ముత్యాల్లా మెరుస్తున్నై! శరీరమంతా తడి ముద్దగానే గోచరించింది నాకు

మంచానికి కాస్త దగ్గరగా వెళ్లి -

సిష్టర్ సిష్టర్ అన్నాను మెల్లగా

ఆమె కళ్లైనా తెరవలేదు

డాక్టర్ని కాకపోయినా సహజమైన ప్రవృత్తితో ఆమె చేతిని తాకి నాడి చూసాను! నాకేం అర్థం కాలేదు

ఏం జరిగింది బాబూ? ఆత్రుతగా అడిగాను

ఏమో అంకుల్ - మాకు పాఠాలు చెబుతూనే - గుండె పట్టుకుని పెద్దగా మూలుగుతూ పడిపోయింది! నేను మంచి నీళ్ళు తీసుకొచ్చి అమ్మ నోట్లో పోసాను చుక్క లోపలికి పోలేదు అంకుల్! మాకు భయవేసి అమ్మా అమ్మా అని ఏడవటం మొదలెట్టాం! అమ్మ లేవలేదు ఏడుస్తూ మెట్లమీది కొచ్చి నించున్నాం - నాన్నగారి కోసం

దుఃఖాన్ని దిగమింగి వివరంగా చెప్పాడు బాబు! ఆ మాటలకు తల పంకిస్తూ నించుంది పాప!

ఆమె పరిస్థితి 'ఇదీ అని నిర్ధారణ చెయ్యలేకపోయినా - వినికిడి జ్ఞానంవల్ల 'హార్ట్ ఎటాక్' కావచ్చనుకున్నాను,

మరోసారి వాచీ చూసాను

పదకొండు దాటుతోంది! వరహాలరావు ఏ క్షణాన్నైనా రావొచ్చు

బాబు - మీరిక్కడే వుండండి - నాన్నగారొస్తారేమో, నే కిందకు వెళ్తాను అని చక చక బయటి కొచ్చేసాను ఆమెను తక్షణం హాస్పిటల్‌కు తరలించటం మనిషన్నవాడు చెయ్యాల్సిన పని! కాని వరహాలరావు గొప్పతనం - కుటుంబ క్రమశిక్షణ తెలుసు కాబట్టి అలాంటి సాహసం చెయ్యదల్చుకోలేదు నేను

మంచం మీద కూచున్నాను గేటువంకే చూస్తూ! గేటుకు చిన్న తాళం వుంటుంది ఆ తాళానికి రెండు తాళం చెవులున్నై! ఒకటి నా దగ్గర - రెండోది వరహాలరావు దగ్గరా! పదకొండు పన్నెండు మధ్య ఇంటి కొస్తుంటాడు వరహాలరావు - రిక్షాలోనో, ఆటోలోనో! మరొకరి వూతలేకుండా ఆరడుగుల దూరాన్ని అరగంటలోపల నడవలేని స్థితిలో మాత్రమే ఇంటికొచ్చే సాంప్రదాయం ఆయన్ది! రెండేళ్లనుంచి ఆయన సాంప్రదాయాన్ని గౌరవిస్తున్నాన్నేను! రిక్షావాలా కానీ ఆటోవాలా కానీ - బాధ్యతగా దించి గేటు మీద పడేసి పోతుంటారు గేటు దగ్గర వరహాలరావు పడే దురవస్థ వర్ణనాతీతం! గేటుకు వేళ్లాడుతూ జేబులోనుంచి తాళం చెవి తియ్యటానికి బగీరధ యత్నం చేస్తుంటాడు తాళం చెవి దొరకదు మధ్య మధ్య సన్నగా మూలుగు! వరహాలరావు గేటుకు వేళ్లాడుతుంటే - అది రాజకుమారుడు రాక్షస గుహలో తిరిగేప్పుడు వినిపించే సినిమా నేపధ్య సంగీతం వినిపిస్తుంటుంది! రెండు మూడు నిమిషాలకు కాని వరహాలరావు గేటుదగ్గర చేస్తున్న సర్కస్ సంగీతం నా చెవులకు చేరదు నేను - లోపలుంటే బయటికొచ్చి తాళంతీసి పక్కకి తొలిగి నించుంటాను వరహాలరావు చేతనైన స్పీడ్‌లో మెట్లెక్కటాని కుపక్రమిస్తాడు అంత నిషాలోనూ నిత్యం - 'థ్యాంక్స్ అనటం మర్చిపోడు అందుకే నాకీ సేవా భాగ్యం!

మళ్లీ వాచీ చూసాను

పదకొండున్నర!

పైన ఆమె ప్రాణాపాయ స్థితిలో వుంది పిల్లలు నిస్సహాయంగా గుండెలవిసేట్లు ఏడుస్తున్నారు! ఈయనగారు యింకా రాలేదు! వచ్చినా పరిస్థితిని అర్థంచేసుకునే స్థితిలో వుండడనేది నిత్య సత్యం! కాని ఆయనకు తెలియకుండా ఆమెను హాస్పిటల్‌కు తీసుకుపోవటం తనకు మాలిన దర్మమే! గొప్పవాళ్ళు ఏమైనా మాట్లాడతారు 'మనిషి'ననిపించుకోవటానికి 'మర్యాద పణం పెట్టగల వైశాల్యం వున్న హృదయం కాదు నాది! సగటు మనిషిని! ఆశలు - అభిలాషలూ సగటువే! మానవతా ధర్మం తెలిసినా - దాని పరిమితులూ ఎరుగుదును!

వరహాలరావు వచ్చేసాడు! ఆటో దడదడ శబ్దం చేసుకుంటూ వెనక్కు తిరిగిపోయింది!

వెంటనే నావంతు సేవ నేను చేసాను

'థ్యాంక్స్ అని వరహాలరావు గోడవెంట పాకుతూ మెట్ల వైపు సాగిపోయాడు

మంచంమీద కూచున్నాను - నిమిషాలు లెక్కబెడుతూ లోపలున్న మా శ్రీమతిని లేపి విషయం చెప్పాలన్న బావం కలిగినా అనవసరం అనిపించిందప్పుడు!

దాదాపు ఐదు నిమిషాలు భారంగా దొర్లేక - పైనుంచి బోరున పిల్లల ఏడుపు వినిపించింది

వెళ్లాలా వద్దా?

తేల్చుకోలేక పోతున్నాను

నా కాళ్ళూ తేలిపోతున్నై!

గుండె ఆరాటంగా కొట్టుకుంటోంది!

అవ్యక్తంగానే కళ్ళూ చెమర్చాయి!

ఐనా తేల్చుకోలేక పోతోంది మనసు! కూచోటం వల్లగాక లేచి నించున్నాను నించుంటే కాళ్ళ


డిసెంబర్ 10 విడుదల!

1985 తెలుగు సినిమా డైరీ

వెల 4 రూపాయలు

ఎడిటర్ మోహన్ కుమార్

* 1931 నుండి 1984 వరకు విడుదలైన తెలుగు చిత్రాలు
* మీ అభిమాన తారల వర్ణ చిత్రాలు
* నటీనటులు, దర్శకులు, నిర్మాతల తదితర సాంకేతిక నిపుణుల కొత్తగా మారిన చిరునామాలు, టెలిఫోన్ నెంబర్లు
* చిత్ర నిర్మాణ సంస్థల వివరాలు, అనేక విశేషాలు
* ప్రముఖ ఫిలిం పత్రికా రచయిత మోహన్ కుమార్ సంపాదకత్వంలో అత్యంత ఆధునికంగా ఆరురంగుల ముఖచిత్రంతో, పూర్తి ఆఫ్‌సెట్ ముద్రణలో డిసెంబర్ 10కి వెలువడుతున్నది!

ఏజెంట్లు తమకు కావలసిన కాపీలకు 25/ కమీషన్ మినహాయించుకొని డబ్బు MO ద్వారాగాని, DD ద్వారాగాని పంపించాలి వి పి పి పద్ధతి లేదు

-కాపీలకు-

అనిల్ పబ్లికేషన్స్

రామారావు స్ట్రీట్, గాంధీనగర్, విజయవాడ-520003

నిలవక – పచార్లు ప్రారంబించాను

అంతలో ఇద్దరు పిల్లలూ పరుగెత్తుకుంటూ కిందికొచ్చారు

ఏం బాబూ?' అన్నాను జీరగొంతుతో

నాన్నగారు పిలుస్తున్నారు అంకుల్' అన్నాడు బాబు – వెక్కిళ్ళు పడుతూనే

నిమిషంలో వెళ్ళి పైన వాలాను! వెనకాలే పిల్లలూ వచ్చారు! ఆమె స్థితిలో మార్పులేదు!

వరహాలరావు మరో బెడ్ మీద ఆమెకంటే కాస్త మెరుగైన స్థితిలో వున్నాడు

నన్ను చూడగానే – ఎంతో ప్రయత్నం మీద తన కుడిచేతిని ఆమెవైపు చూపించాడు! మరి కొంత శక్తిని కూడ • దీసుకుని రెండుచేతుల్నీ దగ్గరికి చేర్చాడు

అంతే!

ఇక నేను – క్షణం నిలవలేదక్కడ!

★ ★ ★

వారం తర్వాత –

ఆ రోజు ఆదివారం! అలవాటు ప్రకారం పదింటికో భోజనంచేసి వార పత్రిక తిరగేస్తూ కూచున్నాను

ఒక పేజీలో వరహాలరావు పేరు కనపడింది! రచయిత ప్రాముఖ్యతను తెలపటానికో తెలీదు – ఆర్టిస్ట్ ఘనతను చాటుకోటానికో తెలీదు – అక్షరాలు ఉసిరికాయ పరిమాణంలో వున్నై! పైపైన తిరగెయ్యటమే కాని కథలు చదివే అలవాటు లేదు నాకు పేజీ తిప్పేసాను

ఆ సమయానికి - 'అంకుల్ అంటూ బాబు వచ్చాడు

'ఏం బాబూ!' అన్నాను ఆశ్చర్యంగా – బాబు మా ఇంటికి రావటం – అదీ నేనుండగా రావటం ఇంతవరకూ జరగలేదు

'తీరిగ్గా వుంటే నాన్నగారు మిమ్మల్ని పైకి రమ్మన్నారు అని నా జవాబైనా వినకుండాతుర్రు మన్నాడు బాబు

గడిచిన వారం రోజుల్లో వరహాలరావుతో ఒక్కసారి మాత్రమే ఓ పది నిమిషాలు మాట్లాడాను మళ్ళీ మామూలే! కాకపోతే నాకు రాత్రి డ్యూటీ తప్పింది – శెలవుపెట్టి ఇంటిపట్టున్న వుంటున్నాడు కాబట్టి!

ఇప్పుడీ ఆహ్వానంలోనూ ఏ ప్రత్యేకతా వుండదని నాకు తెలుసు! వోన్లీ ఫర్ కర్టసీ టాక్!

పైకి వెళ్ళాను

డ్రాయింగ్ రూంలో కూచుని వున్నాడు వరహాల-రావు నన్ను చూస్తూనే –

రండి రండి' అంటూ లేచి నించుని, తన ఎదురుగా వున్న కుర్చీ చూపించాడు

మౌనంగా కూచున్నాను

ఆయనా కూచున్నాడు

పిల్లల అలికిడిలేదు!!

సారీసార్ మిమ్మల్ని డిస్టర్బ్ చేసినట్లున్నాను అన్నాడు వరహాలరావు – ముఖం చాలా తేటగా వుంది

నదింగ్ లైక్ దట్ – ఏం తోచకనే పత్రిక తిరగేస్తూ కూచున్నాను అన్నాను – సుత్తికి సిద్ధమే నన్నట్లు

ఎడంచేతి ముని వ్రేళ్ళతో జుట్టు నిమురుకుంటూ వరహాలరావు-

'సార్ – నన్ను గురించి ఏవనుకుంటున్నారు. మీరు? అన్నాడు చూపుల్ని క్రిందకు సారిస్తూ

'బాంబ్‌షెల్ లాంటి ప్రశ్న!

ఒక్క క్షణం భిణ్ణునైపోయాను అలాంటి సూటి ప్రశ్నకు సమాధానం చెప్పటం ఎవరికైనా సాధ్యమా?

అసాధ్యం అని నిరూపించాను నా ఇబ్బందిని గ్రహించాడు వరహాలరావు

చూడండి సార్ – ' చదివిలు సమస్త శాస్త్రముల్ – చదివిననేమి (ళ) ఫలము?' అని, పతనావస్థలో బిళ్వమంగళుడు వాపోయాడు పాపం! అలాగైంది నా పనీ'

చింతామణి నాటకం గుర్తొచ్చింది నాకు

'అలవాటు ఏదైనా కావచ్చునండీ – అది వ్యసనంగా మారి పరాకాష్ట దశకు చేరితే మనిషికి పతనం తప్పదు! కొన్ని అలవాట్లు తప్పని సరిగా వ్యసనంగా మారటం కూడా ఖాయమే! మీరేమంటారు?

నిజానికి – నేను చెప్పవల్సిందంతా ఆయన నోటి-నుంచే బయటి కొస్తున్నప్పుడు – శ్రోతగా మిగిలిపోవటమే మేలనిపించింది నాకు నవ్వి వూరు-కున్నాను

'మొన్నటివరకూ 'డ్రింకింగ్'ను ఒక మహా పుణ్య కార్యంగా భావించేవాణ్ని! తాగటం తప్పని వాదించే వాళ్ళను – 'తాగుబోతులు అని హేయంగా చూసే వాళ్ళను సంస్కారహీనులుగా, అభ్యుదయ నిరోదకులుగా విమర్శించేవాణ్ని! కాని ఇప్పుడు '

తలెత్తి చూసాడు వరహాలరావు కడిగిన ముత్యంలా మెరుస్తోంది ముఖం!

ఇప్పుడు నాకూ కాస్త మాట్లాడాలనిపించింది

'వరహాలరావుగారూ, జీవితంలో అనేక సంఘటనలు జరిగిపోతుంటై! యాదృచ్ఛికమని సరిపెట్టుకోవాలే తప్ప – ఆ సంఘటనల పర్యవ-సానం మన అభిప్రాయాలను మార్చకూడదని నా ఉద్దేశ్యం

'నో నోసార్! ఐకాన్ట్ ఎగ్రీవిట్‌యూ! వ్యక్తి జీవితాన్నే అంధకార బంధురం చేసే దుర్ఘటనను – దానినుంచి కాపాడుకోగల అవకాశం వుండీ' – యాదృచ్ఛికమని సరిపెట్టుకోవటం ఆత్మ హత్యా సదృశ్యమే! నా విషయమే తీసుకోండి! కీర్తి ప్రతిష్ట-లున్నై – కేవలం నా కోసమే జన్మించిందా అనుకునే అర్ధాంగి వుంది! బంగారంలాంటి బిడ్డలున్నారు అతి ముఖ్యమైన సిరికి లోటులేదు! మరి – ఆ రోజు రాత్రి నా దుస్థితికి కారణమేమిటంటారు? సజీవంగా వుండీ – భార్య మరణ యాతనని కళ్ళారా చూస్తూ – నిస్సహాయంగా నిర్వీర్యంగా నిరర్థకుడిగా పడిపోయి వున్నానే! ఆసమయంలో మీరు ఆదుకోకపోతే – రెండోసారి 'ఎటాక్' రాకముందే హాస్పిటల్‌కు తీసుకునిపోయి వుండకపోతే – నాగతేవిటి? ఈ డబ్బూ – నా కీర్తి నా పిల్లలకు తల్లిని మిగిల్చేవా చెప్పండి విమానాలు కూలిపోతున్నై! రైళ్ళు పడిపోతున్నై! బస్సులు ఢీకొంటున్నై! అంతమాత్రాన జనం ప్రయాణాలు మానుకుంటున్నారా అని తరించే వాళ్ళకు నా నమస్కారం '

వరహాలరావు మాటల్లో నేనూహించనంత ఆవేశం పొంగి పొర్లినా ప్రతి అక్షరంలోనూ ఆవేదన ధ్వనించింది!

అంతలో బాబు నెమ్మదిగా వచ్చి –

'నాన్నగారూ, టైం పదకొండైంది! ఉస్మానియా ఆసుపత్రికి వెళ్ళరూ?' అన్నాడు – ఇంకాయీ సోదేవి టన్నట్లు చూస్తూ

'ఎక్స్‌క్యూజ్‌మీసర్ – మీల్స్ తీసుకుపోవాలి' అని వరహాలరావు హడావిడిగా లేచాడు

'ఈవెనింగ్ నేనూ, మా మిసెస్ వస్తామండీ! మీ శ్రీమతితో చెప్పండి అంటూ నేనూ లేచాను □

